# ఎత్తుపల్లాలు

రాట్నం తిప్పటం ఆపి ప్రొద్దు ఎంతయిందోనని గుమ్మం బయటికి పడమటివైపు ఆకాశంలోకి చూసింది రమ. సమయం ఉజ్జాయింపుగా ఊహించి, లోపలికి వెళ్లేముందు రోడ్డు చివరిదాకా ఓసారి అలవాటుగా ఆమె చూపు, ఎదురుగా వస్తున్న ఓ జట్కాలోని స్త్రీమీద నిలిచిపోయింది. అదే సమయంలో ఆమెకూడా తమవైపు చూసింది. ఇద్దరి మనస్సుల్లో గడిచి పోయిన రోజుల్లో మసుగుపడ్డ కొన్ని దృశ్యాలు తటిల్లతల్లా మెరిశాయి.

రమ యింటిముందు ఆ జట్కా ఆగింది. లోపలినుంచి దిగిన స్త్రీవైపు రమ ఆనందంతో కేకేసింది.

"జ్యోతీ !"

"రమా! నువ్వేనా! చూసీచూడటంతోటే నువ్వే అయివుంటావని అనుమానించాను."

"నువ్వింకా అనుమానించావు. నేను చూడటంతోటే పోల్చుకున్నాను. అబ్బ! ఎన్నాళ్లయింది జ్యోతీ, మనమిద్దరం కలుసుకుని!"

"నాలుగేళ్లు." చిరునవ్వుతో ప్రశ్నకి సమాధానంచెప్పే ధోరణిలో అన్నది జ్యోతి.

"ఇంతే! ఎన్నో ఏళ్లు గడిచిపోయినట్టుగా ఉందిసుమా నాకు."

"నాకు నలభయియెనిమిది నెలలు గడిచినట్టుగా వుంది. ఏమిటను కున్నావో! అంటే నాలుగూ ఇంటూ, మూడువందల అరవై అయిదు - పధ్నాలుగు వందల అరవై ప్లస్ ఒకటి"

"ఒకటేమిటి ?"

"లీపియర్. పధ్నాలుగువందల అరవై ఒక్కరోజు - అంటే..." రమ విరగబడి నవ్వింది.

"రూపు కొంచెం మారినా నీ ధోరణి మాత్రం ఏమీ మారలేదు జ్యోతీ." ఇద్దరూ నవ్వుతూ లోపలికి వెళ్ళారు.

"చరఖాకూడా తిప్పుతావన్నమాట నువ్వు."

"ఊరికే కూచుని ఏంచెయ్యను; ఏదో ఉబుసుపోక" పైకి నవ్వుతూనే అన్నా, రమ మనస్సులో కొంచెం కలతపడ్డది.

"ఈ కుట్టుమిషనేమిటి? మీదేనా?"

"అవును."

"గుడ్డలుకూడా స్వయంగానే కుట్టుకుంటారన్నమాట."

"అవును. ఎవరిపని వాళ్ళు చేసుకోవటంలో తప్పేముంది?"

"అబ్బే, అదికాదు. అయితే రోజూ నీకు చేతినిండా పనే."

"ఆఁ దానికేం లోటులేదు." రమ పొడిగా నవ్వింది.

"మీ ఆయనకేం ఉద్యోగం, ఇందాకటినుంచీ అడగటం మర్చిపోయాను."

"ఆయనకు ఉద్యోగం చెయ్యటం యిష్టంలేదు జ్యోతీ. ఒకరికింద బానిసగా బ్రతకటం నాకు గిట్టదని అంటుంటారు."

"మంచి ఆదర్శమే. కాంగ్రెస్ మెంబరనుకుంటాను."

"కాదు. ఏదో ఓ సంస్థకి కట్టుబడి ఉంటే యుక్తాయుక్త విచక్షణ జ్ఞానం నశిస్తుందని ఆయనవాదం"

"అయితే మరి ఏం చేస్తుంటారు?"

"పత్రికల్లో వ్యాసాలూ, అవీ, రాస్తుంటారు తీరికసమయాల్లో. అదీగాక వ్యవసాయం ఓటుందిలే"

"ఓహో స్వంత వ్యవసాయమూ! ఇంకేం, మీరిద్దరూ స్వయంపోషకులన్నమాట." జ్యోతి నవ్వింది. రమకూడా మందంగా ప్రతిఫలించింది.

ఆ గదిలోని ప్రతివస్తువూ వెలిబుచ్చే నిరాడంబరత్వాన్ని చూసి జ్యోతికి ముచ్చట వేసింది.

"ఇంత నిరాడంబరంగా ఉండగలగటం చాలా అదృష్టం రమా."

"ఎంత నిరాడంబరంగా ఉండగలిగితే ప్రకృతికి అంత సన్నిహితంగా ఉంటాము. అంతకంటే కావాలిసిందేముంది?" రమ ఈ మాటలు అనిన తరువాత, అవి తన హృదయంలోంచి ఒచ్చినవేనా అని ప్రశ్నించుకుంది.

జ్యోతి సాలోచనగా కిటికీలోంచి ప్రకృతి రామణీయకతను పరికిస్తోంది. ఆ కిటికీలోంచి కనిపించే ప్రకృతి దృశ్యం చాలా సుందరంగా వుంది. సూర్యకాంతిలో స్ఫుటంగా కనిపించే కొండల అంచులూ, కొండల వరసకి ఇవతల వెండినీరులా ప్రవహిస్తున్న పంటకాలువ, పచ్చని చెట్లగుబురూ — జీవితంలో చూడదగినవి ఇంకేమైనా ఉన్నాయా అనిపిస్తున్నాయి.

"నువ్వు చాలా అదృష్టవంతురాలివి రమా."

ఆకస్మికంగా వచ్చిన ఈ మాట విని రమ తలెత్తి జ్యోతివైపు ప్రశ్నార్థకంగా చూసింది.

"మీరు ఇంత చిన్నయింట్లో ఎందుకు నివసిస్తున్నారో నాకు తెలిసింది. యింత కళామయ జీవితం గడుపుతున్న నీకంటే అదృష్టవంతురాలు ఎవరున్నారు?"

రమకి ఈ మాటలు మొదట అర్థం కాకపోయినా జ్యోతి కిటికీలోంచి చూస్తున్న దృశ్యం చూసి, ఆమె ఏం ఉద్దేశించి అలా అన్నదో తెలుసుకుంది.

"ఆ దృశ్యం నిజంగా చాలా గొప్పది జ్యోతీ. నేనెప్పుడూ సాయంత్రం వేళల్లో నీలాగే అలా చూస్తూ ఆనందిస్తుంటాను." నిజానికి రమకి ఆ దృశ్యం చూడటం అంత ఇష్టంలేదు, అలవాటూలేదు. పైగా, ఎండవస్తుందని విసుక్కుంటూ, ఆ కిటికీ తలుపులు సాయంత్రం కాగానే మూసేస్తూండేది.

"నువ్వు హాయిగా రోజులు వెళ్లబుచ్చుతున్నందుకు. నాకు చాలా సంతోషంగా వుంది రమా"

"హాయిగా రోజులు గడపగలగటం ఈ జీవితంలో సాధ్యమా?" అని తనలోతాను ప్రశ్నించుకుంది రమ.

"సరే నేను వెళ్లొస్తాను, చాలా సేపైంది."

"వచ్చినప్పటినుంచి నా గొడవలోపడి నీ సంగతులే అడగలేదు, నేను. అన్నట్టు నువ్వుకూడా ఈ వూళ్ళోనేనా ఉండటం?"

"కాదు, మద్రాసులో. పనిమీద మేమిద్దరం వచ్చాము."

"అయితే ఇటు ఎక్కడికి వెళుతున్నావు?"

"ఈ ఊళ్లో మా చుట్టాలున్నారులే. వాళ్లింటికెళ్లి చూసివస్తున్నాను"

"ఉండటం ఎక్కడ?"

"హోటల్లో. సరే, ఇహ నేను వెళ్లొస్తా మరి."

"ఎక్కడికి వెళ్ళటం? ఈ పూట నువ్వు మా యింట్లో భోంచేసి వెళ్ళాలిసిందే."

"భోజనం ఇప్పుడు కాదులే రమా, ఈసారి."

"ఊహుఁ. అలా వీల్లేదు. రాకరాక వచ్చి తుర్రుమని పోదామనుకున్నావా?"

ఇద్దరూ నవ్వారు.

"సరే, అలా అయితే హోటలుకి వెళ్ళి వారికి చెప్పివస్తాను. లేకపోతే నాకోసం అనవసరంగా కనిపెట్టుకు కూర్చుంటారు."

"త్వరగా రావాలి. మర్చిపోవుగద."

"వస్తానన్నానుగా!"

జ్యోతి బండి ఎక్కి వెళ్ళిపోయింది. రమ ఆమె వెళ్ళినవైపే చూస్తూ అలాగే నిలబడిపోయింది. జ్యోతి అన్న మాటలు ఆమెకి ఒక్కొక్కటే జ్ఞాపకం వొస్తున్నాయి. తను ఎంతో హాయిగా ప్రశాంతంగా, చీకూ, చింతా లేకుండా రోజులు గడుపుతోందని ఆమె అభిప్రాయం. బియ్యం ఇంటికి వచ్చేదాకా గ్యారంటీలేదని ఆమె కేం తెలుసు. పొద్దున లేచినప్పటి నుంచీ సాయంత్రం దాకా ఇద్దరూ అవస్థ పడితేగాని రోజులు గడవవని ఆమెకి తెలియదు. ఏమిటో కళామయ జీవితం అట! తిండి ఉంటేగద కళా, గిళాను, దృశ్యాలు చూస్తుంటే కడుపు నిండుతుందా? ఆ ఇంట్లో వాతావరణం చూసి జ్యోతి, నిరాడంబరత్వం అనుకుంది పాపం. అయినా తను వాస్తవం ఆమెకి ఎందుకు చెప్పలేదో తనకే ఆశ్చర్యంగా వుంది. అదేమిటో తను దారిద్య్రం అనుభవిస్తోందని ఎవరికైనా తెలిస్తే తనకి ఎంతో చిన్నతనంగా వుంటుంది, తమాషా. దారిద్ర్యంలో తప్పేముంది?

ఇంట్లో ఏదో చప్పుడైంది. పిల్లి ఏమూతో పడేసి ఉంటుందని "ఛీ" అని అరుస్తూ లోపలికి పరిగెత్తింది రమ.

"నువ్వు "ఛీ" అన్నా "ఛా" అన్నా కొంప వదిలి పెట్టిపోవటం వట్టిది." అన్నాడు శ్రీధరరావు నవ్వుతూ.

"మీరా, పిల్లేమో ననుకున్నాను"

"అనుకోవూ! సరేగాని ఆ కాఫీ ఏదో ఉంటే ఇయ్యి కాస్త."

"అటూ, ఇటూ తచ్చాడకపోతే పిలవకూడదూ?"

"పిలిస్తే పలికేట్టున్నావా నువ్వు. ప్రకృతిలో లీనమై పోతివి."

"ప్రకృతి, పాడు. ఏదో ఆలోచిస్తూ నిలబడిపోయాను గావును." కాఫీఫ్లాస్కు తీసి గ్లాసులో పోస్తూ అంది రమ.

"ఏమిటబ్బా అంత దీర్ఘాలోచన?"

"ఇవాళ మా పక్కింటివాళ్ళ జ్యోతి వచ్చింది. చిన్నప్పటి నుంచీ ఎంతో కలసిమెలసి ఉండేవాళ్ళం. పాపం, అదివస్తే కాఫీకూడా ఇవ్వటానికి లేకపోయె."

"ఏం, ఇవ్వకపోయావు?"

"ఉన్నదికాస్తా దానికిచ్చేస్తే మీకో?"

"అక్కడికి మహా భక్తిఉన్నట్టు నా మీద!"

"సరేగాని, బజారుకు పోయిరావాలి."

"నాకేం అభ్యంతరంలేదు. వెళ్ళిరావచ్చు, నిరాఘాటంగా."

"నేను కాదు, మీరు."

"నేనా? నేను వెళ్ళే వస్తున్నాను."

"సరేలెండి, హాస్యంకాదు. ఈరాత్రికి జ్యోతిని భోజనానికి పిలిచాను."

"చంపావు. బియ్యం ఉన్నయ్యేమో చూసుకున్నావా?"

"అందుకనే బజారుకు వెళ్ళాలనటం."

"బజారుకు వెళితే ఎవడన్నా బియ్యం ధర్మం చేస్తాడనా నీ అభిప్రాయం?"

"ఎలాగో తిప్పలుపడక తప్పదు. ఏంచేస్తాం"

"ఏం చేసేదేమిటి? అసలు ఆవిడగారిని భోజనానికి పిలవమని ఎవడేడిచాడు."

"ఏదో మాటవరసకన్నా అనకుండా వుండలేకపోయాను. తీరా అది వస్తానంటే వొద్దని ఎలా అంటాము?"

"ఆవిడకి పరిస్థితులు తెలియవూ? ఈ కొంపలో ఏ మూల చూసినా దారిద్ర్యం విశ్వరూపం ధరించి చిందులు తొక్కుతూంటే ఆమాత్రం గ్రహించుకోలేదా ఆమె?"

"ఇదంతా చూసి, అది మనం నిరాడంబరులం అనుకుంది."

"అనుకుందా! లేకపోతే నువ్వు సొంతడబ్బా వాయించావా?"

"అదే ఊహించుకుంది. అయితే నేను కొంచెం తాళంవేసినమాట నిజమేలెండి."

"ఇంకేం, అలా బయటపెట్టు. రమా, నిన్నేమనాలో నాకేం అర్థం కావటంలేదు. ఎన్నిసార్లు చెప్పాను. నువ్విలా ఎందుకు నటిస్తావో నాకు ఆశ్చర్యంగా వుంది."

రమ ఏమీ మాట్లాడలేదు.

"దారిద్ర్యం పాపం కాదు; దుర్గుణం అంతకంటే కాదు. మహామహులే ఈ మాటలు అన్నారు. ఇప్పటికి ఏ లక్షసార్లో చెప్పివుంటాను ఈ మాటలు. నువ్వు మనం బీదవాళ్ళమనే సంగతి దాచటానికి ఎందుకు ప్రయత్నిస్తావో నాకు ఎంత బుర్ర బద్దలు కొట్టుకున్నా అర్థంకావటంలేదు."

"నాకూ కష్టంగానే వుంది. ఏం చెయ్యను."

"పైకమీదికి తెచ్చి ఏంచెయ్యాలంటే ఏం లాభం?"

రమ కొంచెం చిన్నబుచ్చింది. ఆ సంగతి గ్రహించి శ్రీధరరావు కోపం దిగమింగుకుని లేచి ఉత్తరీయం అందుకున్నాడు.

"సరే, తప్పేదేముంది? ఆ సంచి ఇలా పడెయ్యి. ఎవడన్నా అప్పిచ్చే మూర్ఖుడు ఇంకా ఉన్నాడేమో చూస్తాను."

రమ చేతిసంచీ తెచ్చి యిచ్చింది. భర్త కోపం పోగొట్టే ఉద్దేశంతో "కొంచెం తొందరగా రండేం" అని లేనినవ్వు తెచ్చుకుని అతని ముఖంలోకి చూసిందామె.

"ఇందులో నీ తప్పూ నా తప్పూ ఏంలేదు రమా. ఈ దారిద్ర్యం చూసి నువ్వు భయపడి పక్కకి తొలగవొద్దని మాత్రమే నేననేది. మనం ఈ స్థితిలో ఉన్నామంటే దానికి కారణం మనుష్యసమాజమే. అయినప్పుడు వాళ్లనించి మనం మన స్థితిని దాచుకోవటంలో అర్థంలేదు. సమాజంలోని ప్రతి వ్యక్తికీ

మనం మన పరిస్థితులు సారంగా చెప్పాలి. చెవుల్లో ఇల్లు కట్టుకుని అరవాలి. నిజం తెలిస్తేనే మోక్షం. మన స్థితికి మనం కారణం కానప్పుడు మనం సిగ్గు పడాలిసిందేమీ లేదు."

ఇంకా ఏదో చెబుదామనుకుని "ఇప్పుడు సమయం కాదులే" అనుకుని మనసు మార్చుకుని బయలుదేరాడు శ్రీధరరావు.

అడుగుదామనుకున్న వాళ్లందర్నీ అడిగేసి వాళ్ళచేత లేదనిపించుకుని చిరాగ్గా బజార్లో నడుస్తున్న శ్రీధరరావు, తన భుజంమీద ఎవరిదో చెయ్యి బరువుగా పడటంవల్ల అదిరిపడి పక్కకితిరిగి చూశాడు. ప్రకాశరావు!

"ఏరా శ్రీధర్, చెవులు చిల్లులుపడేట్టు అరిచినా నీకు వినపడదాయేం?"

"ఏదో పరాకుగా ఆలోచిస్తున్నాలే. అవునుగాని, ఈమధ్య ఐపు లేకుండా పోయావు, ఏమిటి కథ?"

"ఓ, మనకథకేం, చాలా వుందిలే. అదంతా తీరిగ్గా చెబుతాను. తరువాత. ముఖ్యవిషయాలు ఏమిటంటే - ఒకటి పెళ్ళికావటం - ఏం అలా చూస్తున్నావు. శుభలేఖ రాలేదనా? నీ అడ్రసు ఎవరికీ చెప్పకుండా ఉంటే శుభలేఖ ఎలా వొస్తుందనుకున్నావు? నీ పాత అడ్రసుకి పంపితే అది కాస్తా తిరిగొచ్చింది. సరే, రెండోది - ఒకానొకప్పుడు పూటకి గతిలేని ప్రకాశరావు ఇవాళ మూడులక్షల డిపాజిటరు - హాస్యంకాదు. అంత తెల్లబోవాలిసిన అవసరంమేం లేదులే. లాటరీ, గుర్రపుపందాల లాటరీ - తెలిసిందా? పద, కూల్ డ్రింక్స రెండు తీసుకుందాం."

శ్రీధరరావు నోరు తెరుచుకుని వింటున్నాడు. మూడులక్షలు! ప్రకాశరావు సోడాఫౌంటెన్‌లోకి దారితీశాడు.

"నీ సంగతేం చెప్పవేం? ఎంతసేపటికీ కబుర్లు వినటమేగాని చెప్పే అలవాటు లేదుగా నీకు. నువ్వు వొట్టి స్వార్థపరుడివిరా. ఇంకోడు వాగుతుంటే ఆనందించటమేగాని నోటిముత్యాలు రాలనీయవు."

"ఓ, నాకథ కావలసినంత ఉంది. చెబుతాలే. ముందు ఓ పదిరూపాయలుంటే ఇలా పారెయ్యి."

"ఏం, కూల్ డ్రింక్స పార్టీ చాలలేదా?"

"షాపింగ్, గీపింగ్! బజార్లో కొనాలిసిన సామాగ్రి బోలెడుంది. ప్రతివాడూ లేదనేవాడే. సమయానికి నువ్వు కనపడ్డావు. బ్రతికాను"

సోడాఫౌంటెన్ నించి బయటికి వచ్చారు ఇద్దరూ. శ్రీధరరావు బజార్లో కావలసిన సామాగ్రి కొన్నాడు. డబ్బు ప్రకాశరావే ఇచ్చాడు.

"ఏరా, నీ పరిస్థితి ఏం బాగుపడలేదన్న మాట?"

"అతి తెలివిగా మాట్లాడకు. నీలా అకస్మాత్తుగా అందరికీ లక్షలొస్తాయా యేమిటి? అసలే అంతంతమాత్రంగా ఉంటుంటే ఇవాళ్ళో శ్రీమతిగారు దిగారు భోజనానికి. నువ్వు సమయానికి ఎదురుపడ్డావుగాని లేకపోతే ఆవిడగారి ముఖం చూడటానికే తలవంపులుగా వుండేది."

"ఎవరేమిటి ఆ శ్రీమతి?"

"ఎవరోలే, ఎవరైతేనేం మా శ్రీమతిగారి స్నేహితురాలుట. సరే గాని, నీ కథ మొదలుపెట్టు."

ప్రకాశరావు, తను కొన్నాళ్ళు ఎలా కష్టపడ్డదీ, తరువాత అకస్మాత్తుగా ధనలాభం ఎలా కలిగిందీ వివరాలతో సహా ఏకరువు పెట్టటం సాగించాడు. కబుర్లతో, నవ్వులతో శ్రీధరరావు ఇంటిదాకా వచ్చేప్పటికి అప్పుడే సూర్యాస్తమయ మవుతోంది. అంతకుముందే వచ్చిన జ్యోతి శ్రీధరరావు ఇంట్లో అడుగుపెట్టటం చూసి లోపలి గదిలోకి వెళ్ళిపోయింది. శ్రీధరరావుతో ఇంకో పురుషుడు రావటంచూసి రమకూడా అతని చేతిలో సంచీ తీసుకుని లోపలికి వెళ్ళిపోయింది. శ్రీధరరావు తెచ్చిన సంబారాలతో రమ మనసుని అప్పటిదాకా ఆవరించిన ఆందోళన తొలగిపోయింది.

ఆ గదిలోవున్న ఒకేఒక బల్లమీద ప్రకాశరావు ఆసీనుడయ్యాడు. శ్రీధరరావు పెట్టెమీద పరుపుచుట్ట వేసుకుని కూర్చున్నాడు.

"ఇహ నాకథ విను. ఆ రాట్నం ఈ సింగర్ మిషన్. ఇవి రెండూ గిర గిర తిరిగితేనే మా డొక్కలాడటం. తెల్లబోతావెందుకు? నీ స్నేహితుడు శ్రీధర్, టైలర్ కావటం, నీకు అవమానకరంగా ఉందా?"

ప్రకాశరావు ఏమీ మాట్లాడలేదు. అతను కొంచెం ఆశ్చర్యంతో శ్రీధర్ వైపు చూడసాగాడు.

"అవి కాక ఓ పెట్టె పుట్టినాయన దగ్గర, ఓ ఎకరం కౌలుకి తీసుకున్నాను. ఇదే జీవనోపాధి. అందులో నువ్వు ఆశ్చర్యపడాలిసిందేమీ లేదు.

ట్యూషన్లు ఎందుకు మానేశానంటావా? కనీసం స్కూల్ ఫైనలయినా ప్యాసు కాని ట్యూటర్‌కి నెలకి ఇద్దరికి ముగ్గురికి కలిపి నాలుగు రూపాయలకంటె ఎక్కువివ్వటం అనవసరం అని ఆ పిల్లల తాలూకు తండ్రులు తీర్మానం ప్యాసు చేసుకున్నారు. అంతకంటే తక్కువకే నే చెబుతాను, ఇంటికి పంపించమన్నారు. సరే అక్కడితో ఉద్యోగానికి తిలోదకం. ఇహ – ఎస్. ఎస్. ఎల్. సి. కనీసం కంప్లీషన్ సర్టిఫికెట్టయినా లేకపోతే నీకెవడు ఉద్యోగం ఇస్తాడయ్యా పొమ్మన్నారు మూర్ఖులు. ఎకనమిక్సు, పాలిటిక్సు సబ్జెక్టులలో నేను చదివినన్ని పుస్తకాలు ఈ లెక్చరర్లు కాదుగదా, ప్రొఫెసర్లుకూడా చదవలేదని వాళ్ళకేం తెలుసు? మొన్న ఐ. ఏ. ఎస్ పరీక్షల్లో ఇచ్చిన ప్రశ్నలకి ఈ గ్రాడ్యుయేట్లు పోస్టు గ్రాడ్యుయేట్లుకూడా తెల్లమొహాలు వేశారట. ఈ శ్రీధరరావు – డిగ్రీలులేని వీడు ఒక్కొక్క ప్రశ్నకి ఆ పరీక్షకి వెళ్ళివచ్చినవాళ్ళకి సమాధానం చెబుతుంటే వాళ్ళకి హడలెత్తి మీరు ఏ యూనివర్సిటీలో ప్రొఫెసరండీ అనడిగారు. అటువంటి వీడికి గుమాస్తా ఉద్యోగం చెయ్యటానికికూడా అర్హత లేదు.

సరే, అదంతా ఎందుకులే ఇప్పుడు. కారణమేమైతేనేం ఇప్పుడు నేను చేస్తున్నదిదీ. ఇందుకు కారణం నీబోటి లక్షాధికారులే."

"కావొచ్చు."

"కావొచ్చేమిటి, అంతే. ఈ కొంప చూశావా? మనుష్యులు నివసించే కొంపేనా ఇది? నీబోటి పెద్దమనిషి వొస్తే కూర్చోమనటానికి ఆ స్టూల్ తప్ప ఇంకోటిలేదు. పడుకోటానికి మంచంలేదు.

"నిజమే."

"ప్రతిమనిషీ, ముఖ్యంగా ప్రతి ధనవంతుడూ ఈ పరిస్థితి చూసి సిగ్గు పడాలంటావా, లేదా!"

"అవుననుకో, కాని నువ్విలా సహనం విడిచి ఊరికే కేకలు వేస్తే లాభమేమిటి? చేసేదేదో నిర్మాణాత్మకంగా ఉండాలి కదా!"

"ఇంకేం, నువ్వుకూడా వాళ్ళలోనే చేరావు. ఒరే, నాలుగు డబ్బులు రాగానే ఉద్దేశాలుకూడా మారతాయేమిటి?"

"నా ఉద్దేశాలుగాని ఆదర్శాలుగాని ఏమీ మారలేదు."

"కబుర్లు చెప్పకు."

ప్రకాశరావు ఏమీ మాట్లాడకుండా చిన్నగా నవ్వి ఊరుకున్నాడు. వీరి సంభాషణంతా లోపల జ్యోతీ, తనూకూడా విన్నారు. రమ సిగ్గుతో తలవొంచుకుంది. జ్యోతి ఆశ్చర్యంతో రమవైపు దృష్టి నిలిపింది. కాని ఆమె రమని ఏమీ అడగలేదు. సంభాషణ మరీ సహించలేకపోయినప్పుడు రమ లేచి వంటప్రయత్నం చేయసాగింది. జ్యోతికూడా ఆమె వెనకాలే వెళ్ళి సహాయం చేయసాగింది.

"నీ కన్నీ అబద్ధాలు చెప్పాను జ్యోతీ !"

"రమా, నువ్వింత కష్టంలో ఉన్నావనుకోలేదు." రమ మ్లానవదనం చూసి అన్నది జ్యోతి జాలిగా.

"అయినా, ఆయన మరీ గోరంత కొండంతలుగా చెబుతారు లే, అంత పెద్దగా కొంపలేమీ మునుగుపోలేదు."

జ్యోతి కాసేపాగి అన్నది. "ఆ వచ్చినాయన ఎవరో తెలుసా ?"

"ఊఁహుఁ, నువ్వు ఎరుగుదువా ఏమిటి ?" రమ ఆశ్చర్యంతో జ్యోతి వైపు చూసింది.

"ఊఁ"

"ఎవరు ?"

"మా వారే."

"ఏమిటీ !" వింతగా చూసింది రమ జ్యోతి ముఖంలోకి.

"అవును. ఆశ్చర్యమేముందిందులో. మొదట గొంతు వినగానే అనుమానించాను. తరువాత తలుపు సందులోంచి చూశాను."

"అయితే జ్యోతీ, నువ్వు లక్షాధికారిణివా ?" అపనమ్మకంగా ప్రశ్నించింది రమ.

"అవును రమా, లాటరీలో వొచ్చింది."

రమ జ్యోతి దుస్తులవైపు చూసింది.

"మరి ఇంత సామాన్యమైన దుస్తులు కట్టుకున్నావేం ?"

"నాకు నిరాడంబరంగా ఉండటం చాలా ఇష్టం. ఇప్పుడైతే డబ్బు వొచ్చింది గాని మొదటినుంచీ ఎక్కడిది ? నేను డబ్బుకి నా మనసుపై అధికారాన్ని ఇవ్వదలుచుకోలేదు రమా. ఆయనకూడా అంతే."

ఈ మాటలకి రమ కొంచెం చిన్నబోయింది.

"సరే, మనమందరం కావలసినవాళ్ళమే గనక మనకీ తెరచాటు అక్కర్లేదు. మా ఆయనతో పరిచయం చేస్తాను, రా, నీకు."

రమ మొదట సంకోచించినా, తరువాత జ్యోతి ఏమనుకుంటుందోనని ఒప్పుకుంది. గది గుమ్మంలోకి వొచ్చిన జ్యోతినిచూసి ప్రకాశరావు ఉలిక్కిపడ్డాడు.

"జ్యోతీ! నువ్వా, ఇక్కడా! అయితే ఆ శ్రీమతివి నువ్వేనన్నమాట."

శ్రీధరరావు ఏమీ అర్థంగాక ప్రకాశరావువైపూ, జ్యోతివైపూ చూడసాగాడు.

"అయితే మా డబ్బుతో మాకే విందుచేస్తావుట్రా నువ్వు?"

నవ్వాడు శ్రీధరరావు ప్రకాశరావు మాటల్లో అర్థంగ్రహించి. "చాలా తమాషాగా వుందే. మా భార్యాభర్తలు మీ భార్యాభర్తల్ని సినిమా కథలోలాగ కలుసుకున్నాం. అయితే ఆ భోజనమేదో నాకుకూడా ఏర్పాటు చేయిస్తావా, ఏమమ్మా!"

"రమ" అంది జ్యోతి అందిస్తూ.

"ఏమమ్మా, రమా. మీ ఆయన ఇప్పటికే గునిశాడు. అయినా వాడి ఇష్టంతో నాకేమీ నిమిత్తం లేదనుకో."

"నీ డబ్బుతో నీకు తిండి పెట్టటానికి నా కభ్యంతరమేమిటోయ్. చేసేది రమ కనుక రమని అడగటమే సమంజసంలే."

రమ సిగ్గుగా నవ్వింది.

"మా జ్యోతికూడా పని చెయ్యటానికి సంకోచించదులే."

అంతా నవ్వారు. రమ, జ్యోతి వంటపనిమీద లోపలికి వెళ్ళిపోయారు. శ్రీధరరావు మళ్లీ తన ఉపన్యాసం ప్రారంభించాడు. "కానీలే, ఇంకో గంటసేపు ఎలాగో ఓపికపడతాలే" అన్నాడు ప్రకాశరావు.

భోజనాలయిపోయాయి. ప్రకాశరావు, జ్యోతీ సెలవు తీసుకున్నారు. శ్రీధరరావు తీరిగ్గా పడుకున్నాడు.

"మీ దారిద్ర్యం గురించి ఉపన్యాసం ఇవ్వటానికి జ్యోతి ఉన్నప్పుడే సమయం దొరికింది కాబోలు" కోపంగా అన్నది రమ. ఇందాక తనకు జరిగిన పరాభవాల నెమరువేసుకుంటూ.

"జ్యోతి వింటుందని నమ్మకం పోలేదు నాకు."

"అయినా ప్రతివాళ్లతో ఎందుకీ గొడవ? ఊరికే భయపడి నలుగురి నోళ్ళలో పడితే జరిగేదేమిటి?"

"లక్షసార్లు చెప్పాను. దారిద్ర్యం పాపంకాదు, దుర్గుణం అంతంకంటె కాదని నువ్వు వినిపించుకోవు కదా ఖర్మం."

"అసంతృప్తిపడితే దానికి తగిన విరుగుడు చూడాలిగాని, రభసపడటం అనవసరం. వాళ్లకీ వీళ్లకీ మేం ఇలా బ్రతుకుతున్నాం అని ప్రదర్శించుకోటం ఎందుకంట."

"నీవాదన నీది, నావదన నాది. నువ్వు నేను చెప్పేదా న్నర్థం చేసుకోటానికి ప్రయత్నించవు. నేను ధనికసమాజం చేసిన జోగిని అని ఎలుగెత్తి అరిస్తే కాని నాకు తృప్తిలేదు. ఈ ఆర్థికవ్యవస్థ మారాలంటే, గుప్పూచప్పూగా మన ఖర్మ మింతేలే అని సరిపెట్టుకుంటే ఎలా మారుతుంది?"

"అది సరేలెండి. దారిద్ర్యం ఎక్కడపడితే అక్కడే వుందని అందరికీ తెలుసు. దాన్ని తెలియపరచటానికి ప్రయత్నించటం అవసరం. బాగా పరిస్థితులు చక్కబరచటానికి తగిన కృషి—ఇప్పుడు కావలసింది" శ్రీధరరావు మాటాడలేదు.

"ఓ విషయం మీతో చెప్పాలని చాలా రోజుల్నుంచీ అనుకుంటున్నాను."

"ఏమిటది?"

"దారిద్ర్యం పెట్టిన పరీక్షకి మనం ఆగలేకపోతున్నామేమో ననిపిస్తుంది నాకు ఒక్కొక్కప్పుడు."

"మనంకాదు, నువ్వు. నేనా సంగతి నీ కిదివరకే చెప్పాను."

"జ్యోతికూడా మాటలసందర్భంలో ఈ అభిప్రాయం వచ్చేట్టే అంది. మొదట్లో ఈ దారిద్ర్యం భరించటం దుస్సహం అనుకుందట. కాని అది రాను రాను ప్రతి విషయాన్నీ నిర్లక్ష్యంగా చూడటం మొదలు పెట్టిందట. ఒక్కొక్కపూట పస్తుకూడా ఉండేవాళ్లుట వాళ్లు. కాని అది ఏమీ తోచనికేమి కాదుట. అది ఓ లెక్కలోని విషయం కానట్టుగా ఉండేదిట. రానురాను దానికి ఓ విధమైన ధైర్యం, స్థైర్యం, దారిద్ర్యమంటే నిర్భయంగా కలిగా యంటుంది."

"సరేలే, ఇహ పడుకో" అన్నాడు శ్రీధరరావు ముఖం చిట్లించుకుని.

ఆరాత్రంతా రమకి ఏవేవో ఆలోచన లొచ్చాయి. ఆమెకి లోకంలోని ధనవంతు లందరిమీదా చెప్పలేనంత కోపం వచ్చింది. అసలు ఈ డబ్బనేది కొంతమందిదగ్గిరే ఎందుకు కుప్పలుగా పడివుండాలి? ప్రభుత్వం బీదవాళ్లందరికీ ఎందుకు ధనసహాయం చెయ్యకూడదు? అసలు బీదవాళ్లు అనేవాళ్లు ఎలా ఏర్పడ్డారు? ఇలాంటి ప్రశ్నలు వేసుకుంటూ వాటికి సమాధానాలు చెప్పకుంటూ ఆమె నిద్రని దూరం చేసుకుంది. ఈ ఆలోచనల్లో ఆమెకి హఠాత్తుగా ఓ ఆశ కలిగింది. తమకికూడా జ్యోతి, ప్రకాశరావులకి మల్లే ఏ లాటరీలోనో ఓ లక్ష, పోనీ యాభైవేలు, కనీసం పాతికవేలైనా వొస్తే...

కుట్టుయంత్రం చప్పుడుకి రమ పక్కమీంచి లేచింది కళ్లు నలుపుకుంటూ. బారెడు ప్రొద్దెక్కింది. బర్రున ధ్వనిచేస్తూ తిరిగే ఆ మిషన్‌చక్రం వైపూ, శ్రీధరరావువైపూ చూసి ఓ నిట్టూర్పు విడిచిందామె.

"సూర్యారావు వచ్చాడు, లే, ఇంకా నిద్రేమిటి?"

రమ గబుక్కున లేచి ద్వారంవైపు చూసింది. ఎవరూ కనపడలేదు.

"ఏరీ, ఎవరూ లేరే?"

"ఇక్కడికి వచ్చాడని ఎవ రన్నారు?"

"మరెక్కడికి, అసలు సూర్యారా వెవరు?"

"సూర్యభగవానుడు. గడియారాలు కొనుక్కోలేని మనబోటివాళ్ళకి టైము చెప్పే మహానుభావుడు."

రమ మొదట నవ్వింది. కాని శ్రీధరరావున్న చివరిమాటలు ఆమెకి మళ్లీ తన దారిద్ర్యం జ్ఞప్తికితేగా, ఆమెనవ్వు అంతలోనే అంతరించింది.

శ్రీధరరావు ఆమెవైపు నవ్వుతూ ఓసారిచూసి మళ్లీ తనపనిలో నిమగ్నుడయ్యాడు.

"ప్రొద్దున్నే ఈ పాడుమోత మొదలుపెట్టా రేమిటి?"

"రెక్కలాడితేనే డొక్కలాడటం."

శ్రీధరరావు టైలర్‌వృత్తిలో ప్రవేశించటం కొంచెం చిత్రమైన సంగతే. చిన్నప్పుడు వాళ్ళవూళ్లో కొంతమంది చేరి, నేర్చుకునేవాళ్లందరికి ఉచితంగా కొన్ని చేతిపనులు నేర్పారు. ఉత్సాహంకొద్దీ శ్రీధరరావు రాట్నం వడకటం,

బట్టనేయటం, మిషన్ కుట్టుపని, వడ్రంగంలాంటి గృహపరిశ్రమలు కొన్ని నేర్చుకున్నాడు. ఆర్థికపరిస్థితులవల్ల అతనికి స్కూల్ ఫైనల్ చదువుతూ మధ్యలోనే మానేసి స్వయంకృషివల్ల తిండి సంపాదించుకోవలసిన అగత్యం కలిగింది. ఆ ఊరు విడిచేసి పక్కనవున్న బస్తీలో చేరి ఉద్యోగంకోసం ప్రయత్నించాడు. కాని ఏదీ దొరక్కపోవటంవల్ల ట్యూషన్‌లు చెప్పి పొట్ట పోసుకోసాగాడు. ఆ సమయంలోనే అతనికి వివాహమైంది. ట్యూషన్‌లవల్ల వచ్చేడబ్బు ఒక్కడికే సరిగా సరిపోయేదికాదు. ఈ స్థితిలో అతనికి అదృష్టంవల్ల ఓ లాటరీలో కుట్టుమిషన్ వచ్చింది. లాటరీలు వేయటం అతనికి అలవాటు లేకపోయినా అతను చదువుచెప్పే ఓ కుర్రవాడి తండ్రి ఈ లాటరీ నిర్వహించటంవల్ల అతను బలవంతంచేసి శ్రీధరరావుకి ఓ టిక్కెట్టు అంటగట్టాడు. కుట్టుమిషన్ అమ్మేసి ఆ డబ్బుతో కొన్నాళ్ళు హాయిగా గడిపేద్దామని అతను మొదట అనుకున్నాడు. కాని మళ్ళీ అభిప్రాయం మార్చుకుని టైలర్ వృత్తి సాగించాడు. ఆ ఊళ్ళోనేవున్న ఓ 'రెడీమెడ్ డ్రెస్ షాప్'లో ఆర్డర్లు తీసుకునేవాడు. ఆ ఆర్డర్లే అతనికి పూర్తిపని కలిగించటంవల్ల మరోచోటికి ఆర్డర్లకోసం వెతుక్కోవలసిన అవసరం కలగలేదతనికి.

శ్రీధరరావు చదివింది స్కూల్ ఫైనలే అయినా, లైబ్రరీలో చాలా పుస్తకాలు చదివి, మంచి విజ్ఞానం సంపాదించుకున్నాడు. అతనికి తనచుట్టూ ఉన్న వాతావరణంవల్ల తీవ్రమైన అసంతృప్తి కలిగింది. ఒక్కొక్కప్పుడు ఆలోచిస్తూ, ఈ టైలర్ వృత్తివల్ల తనకి ఓ విధమైన మానసికతృప్తి కలుగుతున్నదని అనుమానించేవాడు, ఏదో కసి తీర్చుకున్నట్లుగా భావించేవాడు.

ప్రకాశరావు వచ్చి వెళ్ళి నాలుగు రోజులైంది. ఐదోరోజు అతనిదగ్గర నుంచి శ్రీధరరావుకు ఓ ఉత్తరం వచ్చింది.

"శ్రీధర్, ఈ ఉత్తరంతోపాటు అయిదువేలకి ఓ డ్రాఫ్టు పంపుతున్నాను. నీ కెలాగో రెడీమేడ్ డ్రెస్‌వ్యాపారంలో అనుభవం ఉందిగనుక, ఈ డబ్బుతో ఓ కొట్టు తెరవొచ్చు. ఓ అరడజను కుట్టుమిషన్‌లకి ఆర్డరిచ్చాను. అవి సరాసరి నీ అడ్రసుకే వస్తాయి. స్వంతంగా కుట్టించి అమ్మితే మంచి లాభం ఉండొచ్చు. నాకెలాగా హోల్ సేల్ బట్టలషాపు ఉందాయె. నీకు ఆ రేట్లకే వాటిని పంపుతాను. నువ్వు సమర్థంగా నిర్వహించగలవని నాకు నమ్మకం ఉంది. వెంటనే పని మొదలుపెట్టు. —నీ ప్రకాశరావు."

ఆ ఉత్తరం చదివి శ్రీధరరావు హుషారుగా రమ మీదికి విసిరేశాడు. ఆమె ఉలిక్కిపడి, తిప్పుతూన్న రాట్నం చక్రం వదలి వెనక్కి తిరిగి చూసింది.

"ఆ ఉత్తరం చదువు. ఇంకా రాట్నమెందుకు? ఆ మూల పారెయ్యొచ్చు."

రమ ఉత్తరం చదివింది. ఆమెకి సంతోషంగానే ఉన్నా, తన స్నేహితురాలి దగ్గర్నుంచి తీసుకోటం తన హోదాకి భంగం అని కొంచెం సిగ్గుపడింది.

"జ్యోతి ఇటువంటి పనేదో చేస్తుందని అనుకుంటూనే ఉన్నాం. ఇంతకీ ఏంచేస్తారు ఈ డ్రాఫ్టు?"

"బ్యాంకుకి తీసుకెళ్ళి మారుస్తాను. ఏంచేసేదేమిటి?"

"ధర్మం తీసుకోటం, మనకేమంత ఘనం?"

"ధనవంతుడు డబ్బిస్తే అది ధర్మంకాదు. తను చేసిన దోపిడీలోంచి కొంత మళ్లీ తిరిగివ్వటం మాత్రమే."

"ప్రకాశరావు ఎవరిదగ్గర్నించి దోపిడీ చేశాడు?"

"డబ్బు కూడబెట్టినవాడు దోపిడిగాడే. ఎలా కూడబెట్టినాసరే"

ఇహ కాలం వృథాచెయ్యకుండా వెంటనే లేచి ఉత్తరీయం తీసుకుని బ్యాంకువైపు హుటాహుటిగా వెళ్లాడు శ్రీధరరావు.

ఒక్కొక్కటిగా నాలుగేళ్లు గడిచిపోయాయి. శ్రీధరరావుకి ఇప్పుడు పెద్ద డ్రెస్ మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీ ఉంది. దానికి రాజధాని అంతటా బ్రాంచీలు ఉన్నాయి. ఇప్పుడు శ్రీధరరావు వుంటున్నది ఓ పెద్ద మేడలో. అతని క్రింద ఎంతోమంది పనివాళ్లున్నారు. అతనీ స్థితికి రావటానికి ప్రకాశరావు చాలా సహాయం చేశాడు. రొక్కరూపంగా పదిహేనువేల రూపాయలు అతనికి శ్రీధరరావు బాకీ వున్నాడు. తిరిగి ఇస్తానంటే. "ఇప్పుడేం తొందరలే ఉంచు" అనేవాడు ప్రకాశరావు.

ఈ నాలుగేళ్లలో ప్రకాశరావు, జ్యోతీ శ్రీధరరావు ఇంటికి నాలుగైదుసార్లు వచ్చి వెళ్లారు. రమకి ఇప్పుడు ఇద్దరు పిల్లలు. ఒక మగపిల్లవాడు, ఒక ఆడపిల్ల, జ్యోతికి ఒక మగపిల్లవాడు.

దసరాపండక్కి వచ్చి రెండు రోజులుండి పొమ్మని రమ ఉత్తరంరాస్తే జ్యోతి ప్రకాశరావు వచ్చారు.

ఆ రోజు బజారుకి ఏదో కొంటానికి వెడదామని ముస్తాబవుతూ తన ఆభరణాలు, చీరలు జ్యోతికి చూపించడం మొదలుపెట్టింది రమ.

"ఈ సిల్కుచీర చూశావా జ్యోతీ, ఎంత బావుందో! ఇది ఎంత చేస్తుందో చెప్పు చూద్దాం"

"ఎందుకు రమా, ఇంతింత ఖరీదులు పెట్టి ఇటువంటి చీరలు కొన్నావు? అనవసరపు ఖర్చుకదూ ?"

"నీకూడా ఆయనకి పట్టిన పిచ్చే పట్టినట్టుంది. వారంతేలే, ఏది కొందామన్నా, ఎందుకు ? డబ్బుదండగ, అనటమేగాని, ముచ్చటగా ఫలానిది కొందామాఅని అడగటంలేదు గదా ?"

జ్యోతి నిశ్చలంగా రమవైపు చూసింది. జ్యోతి దగ్గిరనుంచి ఉత్సాహకరమైన నవ్వుగాని, సమాధానంగాని రాకపోవటంవల్ల రమ కొంచెంనిరుత్సాహపడింది.

"నీతో ఓ విషయం చెప్పాలి రమా. నాకు ఇటువంటి చీరలు కట్టుకోవటమంటే తగని భయం"

"భయమెందుకు ?" వింతగా చూసింది రమ.

"ఇవి కట్టుకుంటే నాకు ఏదో తప్పుచేస్తున్నట్టుగా ఉంటుంది"

రమకి కొంచెం విసుగు పుట్టింది. "అయినా అర్హత ఉండొద్దూ కట్టుకోటానికీ పుట్టుకతో రావాలి గాని..." అనే ఊహ రమ మనస్సుకి తట్టింది. కాని జ్యోతిని గురించి అటువంటి చెడ్డ ఊహ తనకే కలిగినందుకు తరవాత సిగ్గుపడింది.

"ఓ సారి నేను పట్టుచీర కట్టుకుని బజారుకివెళ్ళి వచ్చి బద్ధకంతో దానితోనే పడుకున్నాను. ఆ రాత్రి నాకు ఓ పీడకల వచ్చింది. ఎంత భయంకరంగా వుందనుకున్నావు !"

రమ నిరుత్సాహంగానే వింటున్నది.

"కలలో ఎన్నో వేల పురుగులు కనుపించాయి. ఎంత వికృతంగా ఉన్నాయనుకున్నావు ! తలుచుకుంటే ఇప్పటికి భయమేస్తోంది. తరవాత ఆ పురుగులు మనిషి తలకాయల్లా మారాయి. అవి నావైపు ఉరిమి చూస్తూ కటువుగా, గట్టిగా అరవటం సాగించాయి"

"ఏమని ?" రమ, కాస్త భీతితో ముడుచుకొని, ప్రశ్నించింది.

"నీకు సిగ్గులేదా ? నీ సౌఖ్యంకోసం, నీ ఆనందం కోసం, నీ స్వార్థం కోసం మేం కష్టించి ఉత్పత్తి చేసిన పట్టును దొంగిలించటానికి, కాదు, బంది పోటు వెయ్యటానికి—నీకు చేతులెలావచ్చాయి. మా సమాధుల మీదనే నీ భవనం నిర్మించుకుంటేగాని నీకు తృప్తిగా లేదా ? నువ్వు సిల్కుచీర కట్టుకుని కులుకాలంటే మాబోటివాళ్లు ఎంతమంది నశించాలో నీకు తెలియదా? నీకు హృదయం లేదా, ఛీ' ఇలా"

రమ మనస్సు కదలబారింది. ఆమె ఆ సిల్కు చీరలన్నీ మడిచి మళ్లీ పెట్టెలో పెట్టేసింది. సాదాచీర తీసి కట్టుకుని జ్యోతితో సహా బజారుకు వెళ్ళింది. ఇద్దరూ ఓ నగలకొట్లోకి వెళ్లారు. కొన్ని ఉంగరాలు పరీక్షించింది రమ.

"ఈ ఉంగరాలు బాగుండలేదు. ఇంకా రకాలుంటే చూపించండి."

నగలకొట్టువర్తకుడు ఇంకా కొన్ని నమూనాలు చూపించాడు. రమకి అవేవీ నచ్చలేదు. ఆమెదృష్టి అద్దాలలోంచి మెరుస్తున్న ఓ ఉంగరాల సమూహంమీద పడ్డది.

"అవి తియ్యండి."

నగలవర్తకుడు ఓ చిన్న నవ్వు నవ్వి అన్నాడు.

"అబ్బో! అవి చాల ఖరీదువిలెండి, అవి మీ రెక్కడ కొనగలరు."

రమకి అభిమానం ముంచుకొచ్చింది. అతని మాటలు ఆమెకి ఎంతో అవమానకరంగా, హేళనగా తోచాయి.

"అవే కావాలి, తియ్యండి" దృఢంగా, గర్వంగా అన్నది ఆమె. నగల వర్తకుడు ఆమెవైపు ఓసారి ఆశ్చర్యంగా చూసి ఆమెకోరిన ఉంగరాలు తీసి చూపించాడు. రమ వాటిలోంచి ఓ ఉంగరం ఏరి ఖరీదడిగింది.

"పదిహేను వందలు."

రమకి ముచ్చెమటలు పోశాయి. శ్రీధరరావు ఏమంటాడో ? అయినా ఇప్పుడు వెనక్కి తగ్గటంకంటె ఆత్మహత్య చేసుకోటం నయం అనుకుందామె. ఆ వర్తకుడి నడిగి ఓ కాగితం, కలం తీసుకుని శ్రీధరరావుకి ఉత్తరం రాసింది ఓ పదిహేనువందలకి చెక్కు పంపమని.

"మీ గుమాస్తాచేత ఈ అడ్రసుకు ఈ కాగితం పంపండి కాస్త. చెక్కు వస్తుంది."

అడ్రసు చదివి నగలవర్తకుడు. కొంచెం పశ్చాత్తాపడ్డట్టు ముఖంపెట్టి అన్నాడు.

"మీరు శ్రీధరరావుగారి తాలూకా? ఎవరో అనుకున్నాను. క్షమించండి. ఇదిగో ఉంగరం తీసుకువెళ్ళండి. మా గుమాస్తాని మీతో పంపుతాను. దయచేసి చెక్కు ఇప్పించండి."

ఈ మాటలువిని రమ కాస్త సర్దుకుంది. ఇంతాకటి అనుమానం కొంచెం తీరినట్టు ఆమె తలచింది. అయినా, అసలు ఇదంతా జ్యోతివల్లే జరిగింది. అది అడ్డుపెట్టకపోతే తను శుభ్రంగా సిల్కుచీర కట్టుకుని వచ్చేది. అప్పుడు వర్తకుడు తనని చూసి అలా అనగలిగేవాడా? జ్యోతిమీదన ఓ క్షణం రమకి కొంచెం కోపంతోపాటు ఏహ్యం కూడా కలిగింది. కాని మరుక్షణమే తన భావాలకి ఆమె పశ్చాత్తాపపడ్డది. మొదటినుంచీ చివరదాకా జ్యోతి ఈ వ్యవహారం చూస్తూనే ఉన్నది, కాని ఏమీ మాట్లాడలేదు; అలాంటి పరిస్థితుల్లో తను ఏమి మాట్లాడినా విలువ ఉండదని ఆమె గ్రహించింది.

ఇంటికి వెళ్ళేదార్లో కూడా జ్యోతి, అంతవిలువైన ఉంగరం ఎందుకు కొన్నావని రమని అడగలేదు. కాని రమ, జ్యోతి అలా తప్పకుండా అడుగుతుందని అనుకుంది. అలా అడిగివుంటే రమకి ఓ విధమైన సంతృప్తి కలిగిఉండేది.

ఇంటికి వెళ్ళేప్పటికి శ్రీధరరావు ఎక్కడికో బయలుదేరబోతున్నాడు. సంకోచిస్తూనే రమ అతనికి ఉంగరం చూపించి పదిహేనువందలకి చెక్కు రాసివ్వమని మెల్లిగా అడిగింది. ఖరీదు వినేసరికి శ్రీధరరావు ఉలిక్కిపడ్డాడు.

"పదిహేను వందలా? నీ కేమైనా మతిపోతోందా ఏమిటి రమా?"

రమ, జ్యోతి ఈ మాటలు వింటుందేమోనని భయపడుతూ వెనక్కి తిరిగి చూసింది. కాని జ్యోతి అక్కడ లేకపోవటంవల్ల తన గదిలోకి పోయి వుంటుందని ఊహించి స్థిమితపడి, అన్నది.

"ముందు ఆ చెక్కురాసి ఇచ్చి అతనిని పంపించెయ్యండి. ఎందుకు కొనవలసి వచ్చిందో తరవాత చెబుతాను."

శ్రీధరరావు బయటికి ఏమీ అనలేక చెక్కు రాసిచ్చి ఆ గుమాస్తాని పంపేశాడు.

"అయినా నీకు మరీ అతిశయం ఎక్కువైంది రమా" కోపంగా అన్నాడతను. రమకి కళ్ళనీళ్ళ పర్యంతం అయింది.

"మీకు రోజురోజుకీ పీనాసితనం ఎక్కువైపోతోంది. ఏది కొన్నా ఇంతే. ఎందుకు డబ్బువుండీ, ఉపయోగపడకపోయిన తరవాత!"

"ఇటువంటి ఖర్చులన్నీ చేస్తే మనం మళ్ళీ మొదటిస్థితికే వస్తాం." పూర్వపు దారిద్ర్యం తలపుకొచ్చి శ్రీధరరావు భుజాలు ఎగరవేశాడు. ఇప్పుడు ఆ రోజులు జ్ఞాపకం వస్తే అతనికి ఎందుకో చెడ్డభయంగా ఉంటుంది. మళ్ళీ ఆ నరకంలో పడితే సహించటం దుస్సాధ్యం అనుకుంటాడతను.

అనవసరపు ఖర్చుల్ని గురించి రమకీ, శ్రీధరరావుకి చాలాసార్లు వాగ్వాదం జరిగింది. రమ కారు కొనాలని చాలా రోజులనుంచి పంతం పట్టింది. అతనికి మాత్రం ఈ ఖర్చు ఇష్టంలేదు. ఇప్పుడతని మనస్తత్వం, బ్యాంకులో అకౌంటు పెరుగుతూ ఉండాలిసిందేగాని తగ్గరాదని, తగ్గటం మొదలుపెడితే త్వరలోనే సున్నా చేరుకుంటుందని. అదిగాక ఇప్పుడతనికి వారసులున్నారు. తనని తన తండ్రి చేసినట్టు కాక, వాళ్ళకి తను కాస్తో కూస్తో నిలవచేసి చూపించాలి.

ఇటువంటి మనస్తత్వం బలపడ్డంచేత, శ్రీధరరావు తను బీదవాడుగా ఉన్నప్పుడు ధనవంతులను గురించి రూపొందించుకున్న అభిప్రాయాలను మార్చుకోక తప్పలేదు. పనివాళ్ళ పట్లకూడా అతను తన ఉద్దేశాలు మార్చుకున్నాడు.

రమ వెళ్ళిపోగానే ప్రకాశరావొచ్చి బాతాఖానీ వేశాడు శ్రీధరరావుతో. మాటల సందర్భంలో అన్నాడు ప్రకాశరావు.

"మీ పనివాళ్ళకి ఎంతెంత వాటాలిస్తున్నావేమిటి లాభాల్లో ?"

"వాటాలేమిటి ? జీతాలే"

"అయితే బోనస్ ఇస్తున్నావు గావును"

"ఊఁహుఁ"

ప్రకాశరావు ఆశ్చర్యంగా చూశాడు శ్రీధర్ వైపు.

"అయితే..."

ఏమిటన్నట్లు తలెత్తి చూశాడు శ్రీధరరావు.

"లాభాలు బాగానే వస్తున్నాయికదూ ?"

"ఆఁ. నేను వాళ్ళకి జీతాలుకూడా బాగానే ఇస్తున్నాను"

"మిగతాదంతా స్వంతానికి తీసుకుంటున్నావు"

"అవును. అందులో తప్పేముంది"

"నువ్విలా మాట్లాడడం ఆశ్చర్యంగావుంది. నీకు లాభాలు రావటానికి కారణం ఎవరో నీకు తెలియదని ఎలా నమ్మగలను"

"థియరీ వదిలెయ్యి. ఇప్పుడు ప్రాక్టికల్‌లో పడ్డాము"

"డబ్బు కూడబెడుతున్నావా? నువ్వు సరిగా నేననుకున్నట్టుగానే ప్రవర్తిస్తున్నావు శ్రీధర్"

"నువ్వు వాటాలు ఇస్తున్నావు కాబోలు"

"ఆఁ. కష్టపడి పనిచేసేవాళ్ళందరికీ నా కంపెనీలో వాటాలున్నాయి"

"అర్థణా వాటాలు అణా వాటాలూ పేరుకోసం. హ, హ, అంతేనా?"

"నాది ఒక్కడిదే అణావాటా. మిగతాదంతా పంచుకుంటారు" శ్రీధర రావు కొంచెం ఆశ్చర్యంగా చూశాడు.

"నీ కసలు లాభాలెందుకురా? మూడులక్షల మూలధనం ఉన్న వాడివి"

"ఇప్పుడంతలేదు. సరేగాని ఇకనుంచీ శ్రద్ధగా పనిచేసేవాళ్ళకి వాటాలియ్యి. నేను కొన్ని బాధాకరమైన సంగతులు విన్నాను మీ పనివాళ్ళ దగ్గర్నుంచి. కాని అంతగా నమ్మలేకపోయాను"

"వెధవలు. చాటుమాటు ఏడుపులెందుకు? నాతో చెప్పరాదూ? అందుకే వాళ్ళనిచూస్తే నాకు మంట"

ప్రకాశరావు నిశ్చలంగా చూశాడు శ్రీధరరావువైపు. అతని కళ్ళల్లో, బాధ ద్యోతకమైంది.

"నువ్వు నాకు పదిహేనువేలు బాకీ వున్నావు. జ్ఞాపకం ఉందా?"

శ్రీధర్ నమ్మకంలేని కళ్ళతో చూశాడు ప్రకాశరావువైపు. ఈమాటలు అంటున్నది ప్రకాశరావే!

"అవును"

"ఇస్తావా?"

"ఎందుకియ్యాను?" శ్రీధర్ కోపంతో అన్నాడు. తను ఇదివరకు ఇవ్వబోతే వద్దని ఇప్పుడు ఇలా అకస్మాత్తుగా అడగటంలో అర్థమేమిటి?

"చెక్కు రాసియ్యి" వ్యవహార ధోరణిలో మాట్లాడాడు ప్రకాశరావు.

"నేను వాటాలు పనివాళ్ళకి ఇవ్వలేదని నీకు కోపం, అంతేనా?"

"అవును"

"అంటే, నాకంటే నీకు పనివాళ్ళే ఎక్కువన్నమాట"

"కావొచ్చు" ప్రకాశరావు స్థిరంగా అన్నాడు. "నా డబ్బు అనర్హుడికి ఉపయోగపడటం నా అభిమతం కాదు. అది ఏ ఒక్కడికోసమో పిల్లలు పెట్టి వాడి ఖజానాలో శాశ్వతంగా బంధించబడాలని నేను కోరను. అన్నింటికంటె ముఖ్యం నా డబ్బువల్ల ఎవరికీ అపకారం జరగటం నేను సహించలేని విషయం"

ఈ ఉపన్యాసం విన్న శ్రీధర్‌కి ఎక్కడలేని కోపంవచ్చింది. గభాలున డ్రాయరులోంచి చెక్కు పుస్తకం తీసి పదిహేనువేలకి ప్రకాశరావు పేర చెక్కురాసి అతనికిచ్చి కోపంగా అన్నాడు.

"నాకంటే నీకు వాళ్లే ఎక్కువైతే నువ్వుపోయి వాళ్ళదగ్గరే ఉండవచ్చు."

ప్రకాశరావు చెక్కుమడిచి జేబులో పెట్టుకున్నాడు, కాని కదలలేదు.

"తమరు ఇంకా దయచేయరేం ?"

"ఎక్కడికి ? నేను ఇక్కడ ఇంకా రెండు రోజులుండాలి"

"హోటల్లో ఉండు కావాలంటే. ఇహ నువ్వు నీ మొహం నాకు చూపించక్కర్లేదు"

"ఈ ఊళ్ళో నీ కొంప ఉండగా హోటలుతిండి ఏం ఖర్మం ? నువ్వు ఏడ్చినా, మొత్తుకున్నా మనపీరం ఇక్కడే"

ప్రకాశరావు తాపీగా సిగరెట్టు వెలిగించాడు.

"వెళ్లి భోజనం రెడీ అయిందేమో కనుక్కో, ఏ సినిమాకైనా పోదాం"

శ్రీధర్ ప్రకాశరావువైపు రెప్పవాల్చకుండా చూశాడు. తన దుడుకుతనానికి అతనికి పశ్చాత్తాపం కలిగింది.

"నన్ను క్షమించు ప్రకాశ్. అనవసరంగా తొందర పడ్డాను"

"ఏడిచావులే పోరా, తిండి అయిందేమో కనుక్కో. వెధవ గొడవ చెయ్యక" పొగ ఉప్ఫుమని ఊదుతూ అన్నాడు ప్రకాశరావు.

భోజనాలు పెందరాళే ముగించుకుని సినిమాకి బయలుదేరారు అంతా. రమ, ఇందాక తనకి కలిగిన అనుభవం జ్ఞప్తికి తెచ్చుకొని మళ్లీ అటువంటి అవమానం జరగకుండా ముందు జాగ్రత్తగా విలువైన దుస్తులు, ఆభరణాలు ధరించింది. అందరికీ శ్రీధరరావే టిక్కెట్లు తెచ్చాడు.

మొదటి తరగతిలో కూర్చున్న రమకి తన ముందున్న జనసమూహం చూసి ఓ విధమైన గర్వం కలిగింది. వాళ్లందరికన్నా తను గొప్పది; వాళ్ళ

అంతస్తుకన్నా తన అంతస్తు ఔన్నత్యం గలది. అంతనుండి జనం పొందలేనిది ఏదో తను పొందగలిగిందని రమకి ఒకరకమైన సంతృప్తి గలిగి, హాలంతా గర్వం పుట్టిపడే కళ్ళతో కలయచూడసాగింది. జ్యోతి ఆమె వాలకం కనిపెడు తూనే ఉంది. ఇంతలో ఎవరో కొందరు స్త్రీలు వచ్చి రమ ప్రక్కనే కూర్చుంటూ ఆమెను చూసి పలకరించారు. వాళ్ళు ధరించిన దుస్తుల్నిబట్టి చాలా గొప్పవాళ్ళని తేటతెల్లమౌతుంది. సంభాషణ సాగింది. వాళ్ళమాటల్లో ఆ స్త్రీలు తనకంటె ఆర్థికంగా చాలా ఎక్కువ వాళ్ళని గ్రహించవలసి రావటంవల్ల రమకి కొంచెం కష్టం వేసింది. అయితే, ఆమె తన శక్తివంచనలేకుండా ఆ స్త్రీలకంటె తనే ధనికురాలనని నచ్చ చెప్పటానికి ప్రయత్నించింది. తనకి ఎంత గొప్పవాళ్ళతో పరిచయం ఉన్నదీ, తనకి డబ్బంటే ఎంత నిర్లక్ష్యం ఉన్నదీ మొదలైన విషయాలు వాళ్లు నమ్మేట్లు చెప్పటానికి, పాపం చాలా శ్రమపడ్డది. ఈ ప్రయత్నంలో ఆమె అనుకోకుండా ఓ పొరపాటు చేసింది. రమప్రక్కన కూచున్న జ్యోతిని చూసి ఆ స్త్రీలలో ఒకామె ఎవరని ప్రశ్నించగా, అతి సామాన్యమైన దుస్తుల్లో ఉన్న జ్యోతిని తన స్నేహితురాల్నిగా ఒప్పుకోటానికి రమకి కొంచెం తటపటాయించవలసి వచ్చింది.

"మా ఇంటిదగ్గిరఉండే ఆమె లెండి—"

ఈ మాటలు ఆమె నోటినుంచి వచ్చి రాగానే. రమకి తనమీద ఓవిధమైన కోపం వచ్చింది. అంతకంటేకూడా, ఈ మాటలు తను నెమ్మదిగానే అన్నా, జ్యోతి విన్నదేమో, వింటే ఏమనుకుంటుందోననే భీతి ఆమెను బాధించింది. "...అంటే, మా యింట్లోనే ప్రస్తుతం ఉంటోంది. నా స్నేహితురాలే" చివరిమాటలు అని రమ కొంచెం సిగ్గుపడ్డది. ఒక క్షణం ఆమెకి జ్యోతిమీద కోపంకూడా వచ్చింది. "అయినా, ఈ జ్యోతికి మరే, ఎక్కడ ఎలా మసులుకోవాలో తెలియకపోతే ఎలా. తన హోదాకి తగట్టుగా ఆమె ప్రవర్తించవద్దూ! ఏమిటో పిచ్చి ఊహలు, మూఢ నమ్మకాలు. కాలానికి తగట్టుగా ప్రవర్తించాలిగాని..." అని రమ జ్యోతిమీద తనలో తాను విసుక్కుంది. అయితే, ఒక నిమిషం తర్వాత తన మాటలు జ్యోతి విన్నదేమో, తను తటపటాయించి మాట్లాడటం విని ఆమె తననిగురించి ఏమనుకుందోననే ఆందోళన రమకి ఎక్కువైంది. ఆమెకి జ్యోతి ముఖం చూడటానికి చిన్నతనంకూడా వేసింది.

కాని జ్యోతి ఈ ప్రసక్తి అసలు తీసుకురాలేదు సినిమానుంచి ఇంటికి వచ్చింతర్వాతకూడా. రమ మాటలు ఆమె విన్నది కాని మనసులో కష్ట పడటానికి మారుగా ఆమె విషాదంగా ఓ చిరునవ్వు నవ్వింది. తరువాత తను రమ ఇంట్లో వున్న రెండు రోజుల్లోకూడా ఆమె ఈ విషయం గురించి ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని రమతో ఏమీ అనలేదు. అందేత తన మాటలు జ్యోతికి వినపడలేదని రమ సులభంగా అర్థం చేసుకుంది. ఆమెకి హృదయం తేలికపడ్డది. తనంత తానే ఈ ప్రశక్తి తెచ్చి జ్యోతిని క్షమించమని అడుగుదామని ఆమె మొదట్లో అనుకుంటేగాని, తరవాత అలా చేయటంలో గల తెలివితక్కువతనం ఆమె గ్రహించింది. జ్యోతి అసలు తను అన్నది వినని పక్షంలో అనవసరంగా ఆమెకు ఈ విషయం చెప్పి ఆమె మనసుకి కష్టం తనంతట తానే కల్పించటమవుతుందేమోనని ఆమె సంకోచించింది.

జ్యోతి, ప్రకాశరావులు మద్రాసు వెళ్ళిపోయారు. క్రమంగా ఓ నెల రోజులు గడిచిపోయాయి. రమ పట్టుదలవల్ల శ్రీధరరావు ఓ మోటారుకారు కొన్నాడు. ఈ విషయం రమ ఎంతో ఆనందంతో జ్యోతికి తెలియజేసింది. తిరుగుటపాలో జ్యోతి ఉత్తరం రాసింది రమకి.

"రమా!

నిన్ను ఎప్పుడూ నేను 'రమా' అనే సంబోధిస్తాను. నువ్వు నాకెంత సన్నిహితురాలవో మాటల్లో చెప్పలేను గనక, మీరు కారు కొన్నారని విని సంతోషించాను.

ఈ మధ్య నాకు వంట్లో అంత బాగా ఉండటంలేదు. రాత్రిళ్ళు ఏమిటో పిచ్చికలలు వస్తున్నాయి. ఈ కల్లు తలచుకుంటుంటే నాకేమిటో మనసులో అశాంతి ఎక్కువౌతుంది. కలలకి అర్థంలేదని తోసెయ్యటం తెలివైన పనికాదని నా నమ్మకం. నీకంటే నాకెవ్వరూ స్నేహితులులేరు. కనుక ఆ గోడంతా నీకు రాయాలని నాకు ఆవేదనగావుంది. అదిగాక నీ బుద్ధికుశలతలో నాకు ఎంతో నమ్మకం ఉంది. నువ్వు ఈ కలల అర్థం నాకు చెప్పగలవనే విశ్వాసంతో నిన్ను కాస్త శ్రమపెడుతున్నాను. ఓపికతో చదువుతావు గదూ?

ఓ కల చాలా చిత్రంగావుంది. ముందు ఏవో చిన్న చిన్న సెలయేరులు కొండలమీద ప్రవహిస్తూ అన్నీ కలిసి ఒక నదిలోకి ప్రవహించటం కనిపించింది. ఆ నది ఎంతో ఉత్సాహంతో ఈ నీరంతా గ్రహించి మహావేగంగా పోతూ

ఈ నీళ్లని సముద్రంలో దాస్తున్నట్టుగా కనిపించింది. తర్వాత సెలయేళ్లన్నీ ఎండిపోయినట్టు, అవి బక్కచిక్కిన మనుష్యుల పక్క ఎముకల్లోకి చర్మం చొచ్చుకుపోయి ఏర్పడిన గుంటల్లా కనిపించాయి. అన్నింటికంటే ఈ చిత్రం చూడు—ఆ ఎండిపోయిన సెలయేళ్ళన్నీ నదితో ఏమిటో అంటున్నట్టుగా వినిపించింది నాకు. కల్లో సంభవమూ, అసంభవమూ అనే మాటలకి అర్థం ఉండదుగా.

"మా నీళ్ళన్నీ నీ కిచ్చేశాము. ఇప్పుడు ఎండలకి మా సత్తువపోయింది. కొండలమీంచి నీళ్లు తీసుకురాలేకుండా ఉన్నాము. మా నుంచి తీసుకున్న నీళ్లు కొన్ని మళ్ళీ మాకు ఇవ్వాలి నువ్వు"

నది వికటంగా నవ్వింది.

"నేనూ ఇంచుమించు మీకుమల్లేనే ఉంటినిగా. కనిపించటంలేదూ ?

సెలయేళ్లకి కోపం వచ్చింది.

"నీళ్ళన్నీ సముద్రంలో దాచుకుని ఏవో కల్ల బొల్లి కబుర్లు చెబుతావేం ? దాచిన నీళ్ళని తీసుకురా మళ్లీ"

నది గట్టిగా నవ్వింది.

"సముద్రంలో పొయ్యటమేగాని మళ్లీ అక్కణ్నించి నేను తీసుకురాలేను"

"తీసుకురాలేవూ ?" కోపం పట్టలేక సెలయేళ్లు ఒక్కుమ్మడిగా అరిచాయి.

"ఊఁహూఁ" నది నిర్లక్ష్యంగా జలజల ముందుకు పోసాగింది.

"నీకు సిగ్గులేదా ? మేం ఇచ్చినప్పుడు యెలా తీసుకోగలిగావు. మేమంతా తలా కాస్తా దానం చేస్తేనేగా నీ బ్రతుకు. ఎందుకు నీకంత గర్వం. నీకే మహా చల్లని నీళ్లున్నాయనేగా నీ గర్వం. మాకు లేకపోవటానికి నువ్వేగా కారణం. ఇందుకు నువ్వు సిగ్గుపడాల్సింది పోయి గర్వంగా ఠీవిగా గలగల ప్రవహిస్తూ నీ గొప్పతనం ప్రదర్శించుకుంటున్నావా, ఛీ"

నది ఏదో అనబోయింది. గాని ఇంతలో నాకు మెళకువ వచ్చింది.

ఏమిటో దీని అర్థం !

ఇంకోకల. నేను ఒక వనంలో తిరుగుతూ రోజూ తేనెపట్టుల్ని కొట్టి వాటిలో తేనె త్రాగుతూ రోజులు గడుపుతున్నానట. కొన్నాళ్లకి నేను

ఒక అద్దంలో చూసుకుని నా అందానికి నేనే ఆశ్చర్యపోతున్నాను. ఆ సమయంలో హఠాత్తుగా ఒక భీకరమైన కంఠం వినిపించింది.

"సిగ్గులేదా ?"

నేను బిత్తరగా చూశాను. ఎవరూ కనపడలేదు. కాని మళ్ళీ ఆ గొంతు అలా అరిచింది.

"దేహదార్ఢ్యం, అందం చూసుకొని మురిసిపోతున్నావు. ఎక్కడిది నీకా బలం, యవ్వనం. చూడు. ఎన్ని జీవులు నీ మూలంగా మలమల మాడి పోతున్నయ్యో !"

తలెత్తి చూశాను. ఎన్నో లక్షల తేనెటీగలు దీనంగా ఆకాశంలో తిరుగుతూ రోదవేస్తున్నాయి.

మరో రోజు ఇంకో తమాషా కల వచ్చింది. నేను చూస్తూ, చూస్తూ ఉండగానే నేలమీంచి కొన్ని చెట్లు మొలిచి పెరిగి పెద్దవై మహావృక్షాలయి నాయి. తరవాత ఆకాశం మేఘాలు కమ్మి వర్షం కురిసింది. వర్షం వెలిసిన తరవాత ఆ చెట్లు ఇంకా పెద్దవై విశాలంగా వ్యాపించాయి. ఆ చెట్లమీంచి వచ్చే హోరు గాలిలోంచి ఈ విధంగా మాటలు వినిపించాయి.

"భూమివల్ల పుట్టాము, భూమివల్ల పెరిగాము. భూమిమేలులోనే మామేలు ఉంది. ఓ వరుణదేవుడా, మా భూమిని ఎప్పుడూ చల్లగా ఉండేలా చేయడానికి నిన్ను మేము ఆహ్వానిస్తున్నాము."

అన్నీ ఇటువంటి కలలే రమా. వీటిభావం ఏమిటో నాకేమీ తెలియకుండా ఉంది.

త్వరలో ఉత్తరం రాస్తావని ఎదురు చూస్తున్నాను. —నీ జ్యోతి."

రమ ఉత్తరం చదివి కొంచెం ఆందోళనపడింది. ఆమె ఇటువంటి కలల్ని గురించి వినటం ఇదే మొదటిసారి. ఆ కలల్లో ఏదో హెచ్చరికలాంటిది ఇమిడి ఉన్నదని, ఇటువంటి కలలు జ్యోతికి రావటంవల్ల ఆమె మనసు ఎందుకో క్షోభించి ఉండాలనీ ఆమె నిర్ణయించుకుంది. "కాగా, ఇవన్నీ పిచ్చికలలు, వీటికె అర్థమూలేదు, ఏమీలేదు. నువ్వు అనవసరంగా మనసు చెడగొట్టుకోకు" అని ఆమె జ్యోతికి ఉత్తరం రాసింది. కాని జ్యోతి తన ఉత్తరాల్లో ఇటువంటి కలల్ని గురించి తరుచు రాస్తూనే వుంది. కలలు కల్లలుకావు. వాటిలో ఏదో హెచ్చరిక. లేక ఉపదేశంలాంటిది ఏదో ఉంటుందని తన నమ్మకమని నచ్చ చెప్పటానికి ప్రయత్నించేది జ్యోతి. ఇటువంటి కలల్ని గురించి, తన అభిప్రా

యం తెలిసివుండికూడా ఇంకా జ్యోతి తనకి ఎందుకు రాస్తుందోనని రమ ఆలోచించింది. ఆమె తనకి అన్యాపదేశంగా ఏదైనా చెప్పదలచుకుందా? ఈ విషయం గురించి రమ చాలాసార్లు దీర్ఘంగా ఆలోచించింది. కాని స్పష్టంగా ఏ నిర్ణయానికీ రాలేకపోయింది.

రోజులు ఒక్కొక్కటిగా గడిచిపోతున్నాయి. ఇప్పుడు దురదృష్ట వశాత్తూ శ్రీధరరావు వ్యాపారం అంత మంచిస్థితిలో లేదు. అతనికి రాబడి కంటె వ్యయం ఎక్కువ కాసాగింది. వ్యాపారంలో పోటీ కంపెనీలు బయలు దేరాయి. వాటితో పోటీకి శ్రీధరరావు తన వస్తువుల ధరలు తగ్గించాలిసి వచ్చింది. ఇప్పుడు ప్రకాశరావు అతనికి హోల్ సేల్ రేట్లకి గుడ్డలు పంపించ టంలేదు. మిగతా వర్తకులందరి దగ్గిర తీసుకునే రేట్లకే శ్రీధరరావుకీకూడా అమ్ముతున్నాడు. ఇదిగాక, శ్రీధరరావు పనివాళ్లు తమ జీతాలు సరిపోవటం లేదని, వాటిని హెచ్చించకపోతే సమ్మె చేస్తామని బెదిరించటంవల్ల, తప్పని సరిగా వాళ్ళ జీతాలు హెచ్చించవలసి వచ్చింది. ఈ అన్ని కారణాల మూలంగా శ్రీధరరావుకి వ్యాపారంలో పెద్ద దెబ్బ తగిలింది. ఇదే సమయంలో అతనికి ఏజంట్ల దగ్గిర్నించి రావాలిసిన బాకీలుకూడా సరిగా అందటంలేదు. పోటీకోసం చవకగుడ్డలు సంపాదించి వాటిని మార్కెట్టులో పెట్టటంవల్ల ఆ కంపెనీ పరపతికూడా తగ్గింది.

పరిస్థితులు ఇలా ఉండగా శ్రీధరరావు ఋణదాత ఒకడు తన బాకీ అక్కౌంటు పరిష్కారం నిమిత్తం కోర్టులో దావా వేశాడు. అప్పుడు శ్రీధర రావుకి బాకీలు తీర్చగల స్తోమత ఉన్నది కాని అతనిమీద ఉన్న ద్వేషం తీర్చుకోటంకోసం ఈ దావా జరిగిందని వినికిడి. ఈ దావాసంగతి తెలియ గానే ఋణదాతలందరూ ఎగబడ్డారు. సరుకు తెగనమ్మవలసి వచ్చింది. అన్ని బాకీలూ తీరాయిగాని ఇప్పుడు శ్రీధరరావుపని మొదటికి వచ్చింది. కాస్తో, కూస్తో మిగిలిందిగాని దానితో మళ్లీ వ్యాపారం ప్రారంభించటం అసంభవం. ఇహ రమ సంగతి చాలా అన్యాయంగావుంది. ఆమెకి పూర్వం వున్న ధన గర్వం కూకటివేళ్లతో పెకిలివేయబడ్డది. ఆమె ఏంచేయగలదు? జరిగినదానికి తను కూడా చాలావరకు కారణమని ఆమె తీర్మానించుకుంది.

ఈ స్థితిలో జ్యోతి దగ్గర్నించి రమకి ఒక ఉత్తరం వచ్చింది. శ్రీధర రావు పరిస్థితి వాళ్ళకి ఏమీ తెలియలేదు. జ్యోతికి తన విషయం ఉత్తరం రాద్దామని, మళ్లీ అభిమానం చంపుకోలేక రమ ఆమెకీ విషయం తెలియబర

చనిపోలేదు. శ్రీధరరావుకూడా ప్రకాశరావుని సహాయం చేయమని రాయలేక పోయాడు. ఒకవేళ రాసినా, ప్రకాశరావు తనకి ధనసహాయం చేస్తాడని శ్రీధరరావుకి గట్టినమ్మకంలేదు. జ్యోతి రమకి రాసిన ఉత్తరం ఇలా ఉంది.

"రమా !

నా కలల విషయాల్తో నీకు చిరాకు కలిగిస్తున్నానని నాకు తెలుసు. అయినా ఈ ఒక్క కలగురించి నీకు రాయకుండా ఉండలేను. ఇహ నిన్న ఈ విషయాల్ని గురించి బాధపెట్టను. కాని నువ్వు ఈ కలల్ని తేలిగ్గా తోసేస్తున్నావు. ఒక విషయం చెబుతాను. ఈ కలలన్నీ నీకే వొస్తున్నాయని నువ్వు ఊహించుకుని వీటి అర్థం ఏమైవుంటుందో గాఢంగా ఆలోచించు.

మొన్న రాత్రి వచ్చిన కల ఇది. నేను ఆకాశాన్నంటే ఓ మహోన్నత భవనం శిఖరాగ్రంమీద నుంచుని కిందికి చూస్తున్నాను. కింద ఎంతోమంది జనం చీమల్లా పాకిపోతున్నారు. వాళ్ళని చూడగానే నాకో విధమైన స్వాతిశయం జనించింది. వీళ్ళందరికంటె నేను ఎంత ఉన్నత శిఖరంమీద నుంచున్నాను! వీళ్ళంతా నాకంటే ఎంత అల్పులు!

కింద పాకిపోయే జనం కొందరు తలలెత్తి నావైపు ఆశ్చర్యంగా చూస్తున్నారు. నాకు చాలా గర్వం వేసింది. ఈ మనుష్యులందరికీ దుర్లభమైనది నాకు లభ్యమైనది. వాళ్ళందరికంటె నా ఘనత ఎంత ఎక్కువైంది.

నాకు ఊహ రాగానే ఒక వికటాట్టహాసం వినపడ్డది. ఉలిక్కిపడి చూశాను. ఎవరూ కనిపించలేదు. నేను భయకంపితనై మళ్లీ జనంవైపు దృష్టి మరల్చాను.

"నువ్వి శిఖరంమీదికి ఎలా వచ్చావు?" మళ్లీ ఆ గొంతు వినపడ్డది. చూస్తే మనిషి ఎవరూ కనపడలేదు. భయంతో నిరుత్తరనైపోయాను.

"నువ్వు అధికురాలివని అనుకుంటున్నావు. నువ్వు ఇక్కడికి ఎక్కి వచ్చిన మెట్లు కట్టింది ఆ జనమేనని తెలియదూ? వాళ్లకంటే నీ గొప్పతనమేమిటి? వాళ్లు కట్టిని మెట్లమీంచి ఈ ఉన్నత ప్రదేశానికి వచ్చి వాళ్ళని తక్కువగా చూస్తున్నావా? ఇంత అజ్ఞానురాలివా?"

భయవిహ్వలనై వింటున్నాను. మళ్లీ ఆ కంఠం అన్నది.

"నీకు వాళ్లెంత దూరంలో ఉన్నారో, వాళ్ళకి నువ్వూ అంత దూరంలోనే ఉన్నావు. వాళ్లు నీకు అల్పులుగా కనబడితే నువ్వూ వాళ్ళకి అంతే! తెలిసిందా?"

నాకు తెలియకుండానే నేను తలకాయ ఊపాను.

"అసలు ఇంత పెద్దమేడ కట్టించడానికి నీకు మనసెలా ఒప్పింది. ఈ ఇటుకలూ, ఈ డబ్బూ పెడితే ఇంకా ఎంతమందికి నివాసం దొరుకుతుందో గ్రహించలేని మందబుద్ధివా ? ఈ శిఖరంమీద నుంచోటానికి నువ్వు తగవు. దిగుదిగు."

నే నేదో చెబుదామనుకున్నాను గాని, గంభీరంగా మళ్లీ "దిగు" అని ఆ కంఠంనుంచి అరుపు వినబడ్డది. ఆ అరుపుకి నేను మేలుకున్నాను.

నువ్వు బాగా ఆలోచించి దీని అర్థం రాస్తావు కదూ ?

—నీ జ్యోతి."

ఈ ఉత్తరం చదివి రమ తల పైకెత్తి కిటికీలోనుంచి ఆకాశంలోకి శూన్యంగా చూసింది. ఆమె మనసులో ఏవేవో భావాలు దొర్లిపోతున్నాయి. కాసేపటి తరువాత ఆమె దీర్ఘంగా నిట్టూర్చి తనలో తాను అనుకుంది.

"ఇహ ఇటువంటి ఉత్తరాలు రాయవలసిన అవసరం నీకు కలిగించను జ్యోతీ. నీ కలలు— అవి కలలు కావని గ్రహించటానికి నాకు ఎన్నాళ్లో పట్టింది! అంతరార్థం గ్రహించాను. కాని ఏం లాభం, సమయం మించి పోయింది."

రమకి కళ్ళవెంబడి అశ్రువులు రాలాయి.

"ఏడుస్తున్నావా రమా ?"

రమ హఠాత్తుగా వెనక్కి తిరిగింది. శ్రీధరరావు ఓదార్చే స్వరంతో అన్నాడు.

"నాలుగైదేళ్ళకిందట నేను ఎప్పుడూ అదేపనిగా అన్నమాటలు మళ్లీ అంటున్నాను రమా. దారిద్ర్యం పాపం కాదు, దుర్గుణం అంతకంటే కాదు. అయితే అప్పుడీ మాటలు అనటంలో, ఇప్పుడు అనటంలో చాలా తేడా ఉంది. అది నీకుకూడా తెలిసే వుంటుంది."

రమ ఏమీ బదులు చెప్పలేదు. తను ఏడవటానికి కారణం తమకి కలిగిన విపత్తులవల్లకాదని ఆమెకు చెబుదామనుకుంది. కాని ఎందుచేతో ఏమీ చెప్పలేకపోయింది. ఆమె హృదయంలో ఏదో ఆవేదనగా వుంది. అంతా బయటికి వెళ్ళగక్కి మనసు తేలికపరుచుకోవాలని ఆరాటపడ్డది. కాని ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో తెలియక లోపల్లోపలే అణుచుకుంది.

ఇంతలో బయటినుంచి, "శ్రీధర్" అనే కేక వినపడ్డది. కాసేపటిలో ప్రకాశరావు వచ్చాడు. అతనికి శ్రీధర్ సంగతి ఆ కిందటిరోజే తెలిసింది. తన కంపెనీకి శ్రీధర్ ఇచ్చిన ఆర్డర్లన్నీ రద్దు చేశాడని ప్రకాశరావుకి తెలిసింది. ఎందుకా అని ఆశ్చర్యపడ్డాడు. తరువాత అతనికి పరిస్థితులన్నీ పూర్తిగా తెలిశాయి. వెంటనే వచ్చేశాడు. "ఏరా శ్రీధరర్, ఏమిటి ఇంతపని జరిగితే నాకు ఉత్తరమైనా రాయలేదు."

శ్రీధరరావేమీ జవాబు చెప్పలేదు. అతను కుర్చీలో కూర్చుని చేతుల్లో తల ఇముడ్చుకుని బల్లకి ఆనుకున్నాడు. కాసేపటితరువాత ప్రకాశరావే అన్నాడు మళ్ళీ.

"ఏమిటి సంగతి ?"

"అలా జరగాలని వుంది, జరిగింది. ఇప్పుడదంతా తవ్వుకుని విచారిస్తే లాభమేమిటి ?" శ్రీధరరావు నిర్లిప్తంగా అన్నాడు. కొంచెం సేపటిదాకా ప్రకాశరావేమీ మాట్లాడలేదు. "మన చేతుల్లో ఏం ఉంది ?" శ్రీధరరావు తనని తను ఓదార్చుకుంటూ అన్నాడు.

ప్రకాశరావు అతనివైపు ఒకసారి తీక్షణంగా చూసి అన్నాడు. "నేనో విషయం చెప్పదలుచుకున్నాను శ్రీధర్."

"ఒకటేమిటి, ఎన్నైనా చెప్పొచ్చు. వినటానికిప్పుడు నాకు కావలసినంత తీరిక."

"ఇదివరకే చెప్పివుండేవాడిని. కాని నీ వైఖరిచూసి నిష్ప్రయోజనమని మానేశాను. ఏమైనా, ఇటువంటి సమయంకోసం నేనెదురుచూడకపోయినా, అలా విధికృతంవల్ల జరిగిందిగనుక చెబుతున్నాను. ఆ విషయం చెప్పటానికి ఇంతకంటె మంచి సమయం లేదు."

"ఈ ఉపోద్ఘాతాలేమిటి ? సూటిగా చెప్పరాదూ ?" విసుగ్గా అన్నాడు శ్రీధర్. రమ ఆసక్తిగా చెవులు రిక్కించింది.

ప్రకాశరావు ఒక కుర్చీ శ్రీధర్‌కి దగ్గరగా లాక్కుని మొదలుపెట్టాడు.

"నువ్వు దారిద్ర్యం చేసిన సవాలునీ, సంపద చేసిన సవాలునీ కూడా ఎదుర్కోలేకపోయావు. దారిద్ర్యం అంటే భయంలేనట్టు నటిస్తూ దానినుంచి ఎంతో దూరంగా పారిపోవాలని ప్రయత్నించావు. పారిపోయే సైనికుడిని చూస్తే గెలిచినవాడికి చెలరాటం, పారిపోతున్నకొద్దీ వెంట తరుముతాడు.

నువ్వు దారిద్ర్యం ముఖంలోకి చూసి ధైర్యంగా, ఏమీ లెక్కలేనట్టు నవ్వేసి ఉండలేకపోయావు. అంటే నా అభిప్రాయం నువ్వు దారిద్ర్యంతో బాధపడుతూనే ఉండాలని కాదు, బాధపడుతూ కూడా బాధపడనట్టు ప్రవర్తించాలనీ కాదు, భయపడినకొద్దీ భయపెట్టుపడటం ప్రకృతిలో సహజం. కావలసింది ఎదురుతిరగటం. నువ్వు ఎదురుతిరగలేదు. భయపడ్డావు. భయపడనట్టు నటించావు. సంపద వచ్చిన తరువాతకూడా నువ్వు దారిద్ర్యాన్ని చూసి భయపడుతూనే ఉన్నావు. ఆ భయం నీలో స్వార్థానికి ఉన్నతమైన స్థానం ఇచ్చింది. అందుచేత నువ్వు ఎదటివాళ్ల దారిద్ర్యం మనసుకి పట్టించుకోలేదు. సంపద చేసిన సవాలును నువ్వు ఎదుర్కోలేకపోవటానికి కూడా కారణం అదే. దానికి బానిసవయ్యావు. నువ్వు కాంక్షించినకొద్దీ నిన్ను తృణీకరించింది. సంపద, దారిద్ర్యం ఈ రెంటి పట్టునీ నువ్వు తెలుసుకోలేకపోయావు. ఫలితం నువ్విప్పుడనుభవిస్తున్నావు.

రమకూడా ఈ విషయంలో నీకు తోడు వుంది. జ్యోతి అనేది-'రమకి దారిద్ర్యం గురించి రెండు దృక్పథాలున్నాయి. తన దృక్పథంలోంచి చూసి రమ దారిద్ర్యాన్ని చూసి సిగ్గుపడేది. కాని మరొకళ్ళకి దారిద్ర్యం ఆపాదించి చూస్తే 'ఆ దృక్పథంలో రమకి దారిద్ర్యమంటే చిన్నతనం లేదు' అని. ఇది ఎంతవరకు నిజమో రమకే తెలియాలి."

శ్రీధరరావుకి రెప్పవేయకుండా ప్రకాశరావువైపు చూడసాగాడు. రమ హఠాత్తుగా అన్నది.

"అన్నయ్యా, జ్యోతితో చెప్పండి. దాని ఉత్తరాలన్నీ అద్దం కట్టించి గోడకి తగిలిస్తానని."

"అదేమిటమ్మాయ్, మళ్లీ అదో ఖర్చు, మనవాడి పరిస్థితి అసలే మొదటికొస్తే" నవ్వుతూ అన్నాడు ప్రకాశరావు.

"మొదటికి రావటమే మంచిది ప్రకాశ్."

శ్రీధరరావు ఏం ఉద్దేశించి ఇలా అన్నాడో గ్రహించి ప్రకాశరావు స్వేచ్ఛగా గాలిపీల్చి ఉల్లాసంగా వదిలేశాడు.